క్లుప్తంగా

శ్రీపాటెమ్మ తల్లికి విశేష పూజలు



విశేషాలంకరణలో దర్శనమిస్తున్న శ్రీ పాటెమ్మ తల్లి

దెందులూరు : చల్లచింతలపూడిలోని శ్రీ పాటెమ్మ తల్లికి గురువారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ యలమర్తి శ్రీనివాసరావు, పెరుగ్గూడెం మాజీ సర్పంచ్ హేమలత శ్రీ పాటెమ్మ తల్లికి 20 కాసుల బంగారం, వెండితో మంగళసూత్రం, కిరీటం, వడ్డాణం, పెద్ద ముక్కుపుడక, త్రిశూలం, నేత్రాలు తయారుచేయించి వాటితో అమ్మవారిని అలంకరించారు. తొలుత ఆలయ కమిటీ సభ్యులతో కలిసి చైర్మన్ దంపతులు శ్రీ పాటెమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేశారు.

యర్రా మరణం తీరనిలోటు



యర్రా మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు

గణపవరం : మాజీ మంత్రి, సీనియర్ రాజకీయ నాయకుడు యర్రా నారాయణస్వామి మరణం తీరనిలోటని ఎమ్మెల్యే వాసుబాబు అన్నారు. బుధవారం ఉప్పులూరులో యర్రా నారాయణస్వామి భౌతికకాయాన్ని ఆయన సందర్శించి నివాళులర్పించారు. రాజకీయాలలో నీతి నిజాయితీలే ఆభరణాలుగా ఎన్నో పదవులు నిర్వహించి, మచ్చలేని నాయకునిగా యర్రా మిగిలారని కొనియాడారు. ఆయన కుమారులు నవీన్ సోదరులను పరామర్శించి సానుభూతి తెలియజేశారు. గణపవరం మండలానికి చెందిన పలువురు నాయకులు ఉప్పులూరు తరలివెళ్లి యర్రాకు నివాళులర్పించారు.

నేడు నారాయణపురంలో ఆసరా చెక్కుల పంపిణీ

ఉంగుటూరు: నారాయణపురం లయన్స్ కల్యాణ మండపంలో శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు డ్వాక్రా మహిళలకు వైఎస్సార ఆసరా 3వ విడత చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మరడ మంగరావు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే వాసుబాబు ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. డ్వాక్రా మహిళలు, వైఎస్సార్ సీపీ నేతలు హాజరై ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాల్సిందిగా కోరారు.

నేడు కలపర్రులో గడపగడపకు మన ప్రభుత్వం

పెదపాడు : మండలంలోని కలపర్రు గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం 4 నుంచి 9 గంటల వరకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ పెదపాడు మండల కన్వీనర్ అప్పన ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి పాల్గొని గడపగడపకూ వెళ్లి ప్రభుత్వం అందించిన పథకాలను ప్రజలకు వివరించి, వారి సమస్యలు అడిగి తెలుసుకుంటారన్నారు. మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరుకావాలని ప్రసాద్ కోరారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పెదవేగి : చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్సై ఎం.లక్ష్మణ్ తెలిపిన వివరాల ప్రకారం పెదవేగి మండలం రామచంద్రపురం గ్రామానికి చెందిన గురజాల గాంధీ (50) గత నెల 22న రామచంద్రపురంలోని తన తోటలో ఎండిన చెట్టును నరుకుతుండగా చెట్టుపై నుంచి జారీ కింద పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. అప్పటి నుంచి ఏలూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పంచాయతీ కార్యదర్శికి షోకాజ్ నోటీసు

పెదవేగి : అమ్మపాలెం పంచాయతీ కార్యదర్శికి షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు జిల్లా పంచాయతీ అధికారి జీవీ మల్లికార్జునరావు గురువారం సాయంత్రం తెలిపారు. అమ్మపాలెం పంచాయతీ నిధులు సుమారు రూ .లక్షా 60 వేలను కార్యదర్శి కిషోర్ తన బంధువుల ఖాతాలకు బదిలీ చేయడానికి ప్రయత్నించారనే ఆరోపణలపై జిల్లా అధికారులు విచారణ నిర్వహించారు. ఈ విచారణలో కార్యదర్శి కిషోర్‌పై ఆరోపణలు నిరూపితం కావడంతో కార్యదర్శికి డీపీఓ మలికార్జునరావు షోకాజ్ నోటీస్ జారీ చేశారు.

సస్పెన్షన్ ఎత్తివేత

ఏలూరు టౌన్: ఏలూరు 30వ డివిజన్ కార్పొరేటర్ పప్పు ఉమామహేశ్వరరావుపై సస్పెన్షన్ ఎత్తివేసినట్టు వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆళ్ల నాని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత ఆరు నెలలుగా వైఎస్సార్‌సీపీ నిబంధనలు పాటిస్తూ క్రమశిక్షణతో మెలుగుతూ ఉన్నారని తెలిపారు. ఉమామహేశ్వరరావు ఇకపై కార్యక్రమాల్లో యథావిధిగా పాల్గొంటూ.. పార్టీ బలోపేతానికి కృషి చేస్తారని వివరించారు.

కనుల పండువగా సీతారాముల కల్యాణం

భీమడోలు : శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని రాములోరి కల్యాణం గురువారం వాడవాడలా అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామి వారి కల్యాణాన్ని తిలకించేందుకు అశేష భక్తజనం తరలి రావడంతో ఆలయ ప్రాంగణాలు కిటకిటలాడాయి. ఆలయాల్లో శ్రీరామ నామస్మరణ మార్మోగింది. గుండుగొలనులో శ్రీసీతారామస్వామి కల్యాణోత్సవాలు ఆలయ ఫౌండర్ ట్రస్టీ కొండ గంగారాజ్ కుమార్ పర్యవేక్షణలో నిర్వహించారు. యాజ్ఞిక స్వామి దివి గోపాలాచార్యులు, ఆలయ అర్చకులు సుధీరాచార్యులు ఆధ్వర్యంలో స్వామి వారికి ఎదుర్కోలు ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రధాన ఆలయం నుంచి మేళతాళాలతో సుందరంగా ముస్తాబైన స్వామి, అమ్మవార్లకు శోభాయాత్ర నిర్వహించి ఆలయానికి తీసుకువచ్చారు. అనంతరం వేడుకగా కల్యాణం నిర్వహించారు. గ్రామానికి చెందిన దంపతులు పీటాలపై ఆశీస్సులై స్వామివారి కల్యాణంలో పాల్గొన్నారు. భీమడోలు రావిచెట్టు సెంటర్‌లో వేంచేసియున్న శ్రీసీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ దంపతులు, ఎస్‌పీపీ ఆల్తి శ్రీనివాస్ దంపతులు, పనస మోహన్, పనస భాస్కర్ దంపతులు, పలువురు జంటలు కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. భీమడోలు పోలీస్‌స్టేషన్ ఆధీనంలోని శ్రీసీతారామ స్వామి ఆలయంలో నిర్వహించిన ఉత్సవాల్లో సీఐ వి.వెంకటేశ్వరరావు దంపతులు పీటలపై కూర్చుని స్వామివారి కల్యాణాన్ని జరిపించారు. తొలుత పుర వీధుల్లో స్వామి వార్లను ఊరేగింపుగా ఆలయానికి మంగళవాయిద్యాల నడుమ తీసుకుని వెళ్లారు. ప్రత్యేకపూజలు చేసి కల్యాణతంతును ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ పాము సునీతామాన్‌సింగ్, ఎంపీటీసీ ఆల్తి గోపి, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు, నాయకులు సుతాపల్లి ప్రసాద్, మద్దాల అప్పారావు, యడ్ల నాగేశ్వరరావు, వై.శ్రీను, పి.శ్రీను, బూర్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు. పోలసానిపల్లిలో బీసీ కాలనీలోని శ్రీసీతారామస్వామి ఆలయంలో ఆలయ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కల్యాణోత్సవంలో సర్పంచ్ షేక్ రహీమాబేగం హసేనా దంపతులు పూజలు చేశారు. కార్యక్రమంలో వలంటీర్ కె.వంశీ, కమిటి నిర్వాహకులు రాజేష్, యువకులు పాల్గొన్నారు.

గుండుగొలనులో హనుమద్ సేవ

గుండుగొలనులోని శ్రీదేవిభూదేవి సమేత శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం శ్రీరామనవమి వేడుకలు నిర్వహించారు. సాయంత్రం స్వామి వారిని హనుమంతుని వాహనంపై ఊరేగించారు. ఆలయ ఉత్సవ కమిటీ నిర్వాహకులు వగ్వాల మీనా కుమారి అచ్యుతరామారావు, వగ్వాల రాజారామకృష్ణారావు, సుబ్రహ్మణ్యం, రామన్ పాల్గొన్నారు.



బువ్వనపల్లి రామాలయంలో ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు



కొండలరావుపాలెంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, ఇతర నాయకులు



గుండుగొలనులో కల్యాణోత్సవాల్లో భాగంగా అమ్మవారి మంగళ సూత్రాలను భక్తులకు చూపుతున్న అర్చకులు

నిడమర్రులో...

నిడమర్రు : మండలంలోని అన్ని గ్రామాల్లో గురువారం శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం సీతారాముల కల్యాణం ఆయా గ్రామాల భక్తు జన సందోహం మధ్య కనుల పండువగా జరిగింది. బువ్వనపల్లి, అడవికొలను రామాలయంలో ఎమ్మెల్యే పుప్పాలవాసుబాబు పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. బువ్వనపల్లిలో వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ పుప్పాల కన్నబాబు, మండల కన్వీనర్ సంకు సత్యకుమార్, జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు వెజ్జు వెంకటేశ్వరరావు, రామాలయం కమిటీ చైర్మన్ ఇమ్మిడిశెట్టి కృష్ణమోహన్, వైస్ చైర్మన్ సంకు తాతాజి, వైస్ ఎంపీపీ సమయం వీరరాఘువులు, ఉప సర్పంచ్ వెల్లంకి నరేష్, గ్రామ పార్టీ అధ్యక్షులు కాన్వెంట్ సంకు శ్రీను తదితరులున్నారు. అడవికొలను రామాలయంలో పాపోలు నాని దంపతులు స్వామివారికి కల్యాణం నిర్వహించారు. ఉత్సవకమిటీ అధ్యక్షుడు పాపోలు రంగారావు, పార్టీ అధ్యక్షుడు పాపోలు వెంకట సుబ్బారావు, నిమ్మల రమేష్, నిమ్మల బుజ్జి, పాపోలు సుబ్బారావు, గుండుమోలు చిన్న తదితరులున్నారు.

గణపవరంలో...

గణపవరం: గణపవరంలోని సలాదివారి వీధిలో ఉన్న రామాలయంలో సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. పలువురు దంపతులు కల్యాణంలో పాల్గొన్నారు. గణపవరం వెలంపేట రామాలయం వద్ద శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా జరిగాయి. సరిపల్లె, కొత్తపల్లి, వరదరాజపురం, జల్లికొమ్మర, అర్ధవరం, వల్లూరు, పిప్పర, గోపవరం, చిలకంపాడు, కాశిపాడు, కేశవరం, మొయ్యేరు, ముప్పర్తిపాడు, కొండేపాడు తదితర గ్రామాలలో శ్రీరామ నవమి వేడుకలు నిర్వహించారు. ఆయా ఆలయాల వద్ద పానకాలు పోశారు. అన్నసమారాధన కార్యక్రమాలు జరిగాయి. బువ్వనపల్లిలోని రామాలయం వద్ద సీతారాముల కల్యాణం నిర్వహించి, సుమారు మూడు వేలమందికి అన్న సమారాధన చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ ఐ.కృష్ణమోహన్ తెలిపారు.



గోపన్నపాలెంలో భక్తులకు పానకాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఉంగుటూరులో...

ఉంగుటూరు : మండలంలోని రామాలయాల్లో గురువారం శ్రీసీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉంగుటూరు తూర్పుకాపుల రామాలయంలో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కోరాడ శివ దంపతులు పీటలపై కూర్చుని కల్యాణం నిర్వహించారు. ఉంగుటూరు సర్పంచ్ బండారు సింధు మధుబాబు, పంచాయతీ కార్యదర్శి గిరి గ్రామంలోని రామాలయాలకు ఉచితంగా 15 కేజీల చొప్పున బెల్లం అందజేశారు.

దెందులూరులో..

దెందులూరు: శ్రీరామనవమి వేడుకలు గ్రామ గ్రామాన భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ప్రతి గ్రామంలోనూ రామాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయాల ఎదుట చలువ పందిళ్లలో కూర్చొని స్వామి వారి కల్యాణాన్ని భక్తులు తిలకించారు. సానిగూడెంలోని ప్రాచీన రామాలయంలో శ్రీరామనవమి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. సర్పంచ్ శనపల్లి రామకృష్ణ (విష్ణు), మాజీ సర్పంచ్ యలమర్తి శ్రీనివాసరావు దంపతులు, గ్రామస్తులు పాల్గొన్నారు. గోపన్నపాలెం, అన్ని గ్రామ శివారు ప్రాంతాల్లో భక్తులకు రామాలయాల వద్ద పానకం పంపిణీ చేశారు.

పెదవేగిలో..

పెదవేగి: శ్రీరామనవమిని పురస్కరించుకుని గురువారం వంగూరులోని శ్రీ ఆంజనేయస్వామివారి ఆలయంలో శ్రీసీతారాముల కల్యాణం కన్నుల పండుగగా నిర్వహించారు. ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం రాయన్నపాలెం, కొండలరావుపాలెం, రాట్నాలకుంట, రామచంద్రపురం, బాపిరాజుగూడెం, పెదకడిమి గ్రామాల్లో శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవంలో ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో విజయరాయి సొసైటీ చైర్మన్ పాలడుగు పెదబాబు, సర్పంచ్ పాలడుగు సత్యవతి, ఎంపీటీసీ దేవళ్ళరాజు రాధికరాజశేఖర్, పర్వతనేని నాగయ్య, చళ్లగొళ్ళ భూస్వామి, పర్వతనేని కృష్ణారావు, వీరమాచినేని నాగబాబు, మన్నె బాబురావు, బొప్పన కృష్ణారావు, బొప్పన ఫణి కుమార్ పాల్గొన్నారు.

పెదపాడులో..

పెదపాడు : పెదపాడు మండలంలో శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సత్యవోలు గ్రామంలో జెడ్పీటీసీ ఘంటా పద్మశ్రీ ప్రసాదరావు పాల్గొని పూజలు చేశారు. సాయంత్రం స్వామి వారి గ్రామోత్సవం నిర్వహించారు. ఈకార్యక్రమంలో నర్సాపురం నియోజకవర్గ పరిశీలకుడు ఘంటా ప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు. అప్పనవీడులోని అభయాంజనేయస్వామి ఆలయం, పెదపాడు శివారు గండిచెరువుగట్టు శ్రీసీతారాముల ఆలయం, పెదపాడులోని ఆంజనేయస్వామి ఆలయంలో శ్రీసీతారాముల కల్యాణం వైభవోపేతంగా నిర్వహించారు.అనంతరం గ్రామోత్సవం జరిపారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రసాద వితరణ చేశారు.



భీమడోలులో కల్యాణోత్సవంలో పాల్గొన్న జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ, ఎస్‌పీపీ ఆల్తి సాంబశివరావు పలువురు దంపతులు



సత్యవోలులో సీతారాముల కల్యాణంలో పాల్గొన్న జెడ్పీటీసీ ఘంటా పద్మశ్రీ ప్రసాదరావు



గణపవరంలో సీతారాముల కల్యాణం తిలకిస్తున్న భక్తులు



ఉంగుటూరు తూర్పుకాపుల రామాలయంలో కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

పేదల ఆరోగ్య భద్రతే ప్రభుత్వ లక్ష్యం

గణపవరం : పేద, మధ్యతరగతి ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం పూర్తి భద్రత కల్పిస్తోందని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. బుధవారం ఎంఎల్ఏ క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్ర వైఎస్ జగన్ ఆరోగ్యశ్రీ పథకానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని అన్నారు. 3వేల వ్యాధులు ఆరోగ్యశ్రీలో చేర్చి ఉచితంగా వైద్యం అందిస్తున్న ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదేనన్నారు. గత పాలకులు పట్టించుకోని 108, 104కు కొత్త వాహనాలను సమకూర్చడంతో ఈ వాహనాల ద్వారా నిరంతరం ప్రజలకు వైద్యసేవలు అందుతున్నాయన్నారు. త్వరలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ప్రారంభిస్తున్నామని, వైద్యులు ఇంటివద్దకే వచ్చి వైద్య సేవలు అందించి, ఉచితంగా మందులు ఇస్తారని వాసుబాబు చెప్పారు. ఈ సందర్భంగా గణపవరం, నిడమర్రు, ఉంగుటూరు మండలాలకు చెందిన లబ్దిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందచేశారు. కార్యక్రమంలో ఉంగుటూరు ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, నిడమర్రు మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ సంకు సత్యకుమార్, మండల ఉపాధ్యక్షుడు సమయం వీరరాఘువులు, బువ్వనపల్లి వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కాన్వెంట్ శ్రీను పాల్గొన్నారు.



క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

గణపవరం : ఉండి విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు గణపవరం, చినరామచంద్రపురం, సరిపల్లె, క్రొవ్విడి గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఈఈ ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు.

నేడు చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు ప్రారంభోత్సవం

దెందులూరు : దెందులూరులో మొటపర్తి బాబి మూడంతస్తుల భవనంలోని ఫస్ట్ ఫ్లోర్‌లో శుక్రవారం ఉదయం 10.30 గంటలకు చైతన్యగోదావరి గ్రామీణ బ్యాంకు ప్రారంభోత్సవం జరుగుతుందని బ్రాంచ్ మేనేజర్ కె.నాగార్జున తెలిపారు. బ్యాంకు ఏపీ చైర్మన్ టీ.కామేశ్వరరావు, రీజనల్ మేనేజర్ జీఎస్ఎన్ సతీష్ కుమార్ ముఖ్య అతిథులుగా విచ్చేస్తారన్నారు. దెందులూరు మండలంలో చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు సేవలు విస్తరించాలని మాజీ సర్పంచ్ మొటపర్తి సాయికుమారి, రాంబాబు కృషి చేశారన్నారు.

నేడు సొసైటీ సమావేశం

ఉంగుటూరు : నారాయణపురం విశాల పరపతి సహకార సంఘం సమావేశం స్థానిక సొసైటీలో శుక్రవారం సాయంత్రం 4 గంటలకు నిర్వహిస్తున్నట్లు సొసైటీ అధ్యక్షుడు పాపారావు బాబ్జి తెలిపారు. ఈసమావేశానికి సొసైటీ పరిధిలోని గ్రామాల రైతులు పాల్గొనాలని ఆయన కోరారు. 2023-24 అంచనా బడ్జెటు అమోదించటం, 2022- 23 సంవత్సరంలో జమాఖర్చులు అమోదించటం జరుగుతందని ఆయన తెలిపారు.

కోతుల బెడదతో బెంబేలు

ఉంగుటూరు : ఉంగుటూరు గ్రామంలో కోతుల ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. వాటిని కొడితే ఎదురుతిరిగి దాడి చేస్తున్నాయి. ఈ పరిస్థితి గత నెలా పదిహేను రోజులుగా నెలకొని ఉంది. దీనిపై గ్రామ పంచాయతీ పట్టించుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. గ్రామంలో 200కు పైగా కోతులు సంచరిస్తున్నాయి. వంట గదిల్లోకి చొరబడి కూరగాయలు, ,తినుబండారాలు పట్టుకుపోతున్నాయి. మహిళలు, పిల్లలు వీధుల్లో తిరగడానికి భయపడుతున్నారు. పొరుగు గ్రామాలనుంచి వానరాలను తీసుకువచ్చి గ్రామంలోకి వదిలేయడం వలనే ఇన్ని కోతులు పెరిగిపోయాయని అంటున్నారు. కోతుల బారినుంచి రక్షించాలని గ్రామప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై గ్రామ కార్యదర్శి గిరిని వివరణ కోరగా సర్పంచ్, ఇతర ప్రజాప్రతినిధులతో చర్చించి సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.



ఉంగుటూరు కోనేరుపేటలో ఓ ఇంట్లోకి చొరబడి ఆహారం తింటున్న వానరాలు

సీలింగ్ భూములు పేదలకు పంచాలి

దెందులూరు : పేదలకు అసైన్డ్, సీలింగ్, గయాళ భూములు పంచాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ కోరారు. గురువారం దోసపాడులో రిలే దీక్షలు చేస్తున్న దళితులకు మద్దతును ప్రకటించిన అనంతరం ఆయన మాట్లాడారు. స్థానికేతర భూస్వాములు అక్రమంగా భూములను అక్రమించుకున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. రెవెన్యూ శాఖాధికారులు పేదలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పేదలకు చెందిన భూములకు హక్కు పత్రాలను రెవెన్యూ శాఖాధికారులు ఇవ్వాలన్నారు.

సీఎం జగన్ పాలనలోనే మహిళా సాధికారత

ఏలూరు రూరల్: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మహిళలు సాధికారత సాధిస్తున్నారని ఎంపీపీ పెన్మత్స శ్రీనివాసరాజు అన్నారు. ప్రపంచ మహిళ దినోత్సవ కార్యక్రమాల్లో భాగంగా ఏలూరు మండల పరిషత్ సమావేశ మందిరంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించేందుకు సీఎం వైఎస్ జగన్ వైఎస్సార్ ఆసరా, అమ్మఒడి, జగనన్న చేయూత తదితర సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని వివరించారు. ఉద్యోగ, రాజకీయ పదవుల్లో 50 శాతం మహిళలకే అందించారన్నారు. మండల పరిషత్, ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న సుమారు 28 మంది మహిళ ఉద్యోగులకు ఆయన చీరలు బహూకరించారు. ఎంపీఈఓ బి.ప్రణవి, ఈఓపీఆర్డీ ఎం సరళకుమారి, ఎంఈఓ సబ్బిత నరసింహమూర్తి, పీఆర్ఏఈ కృష్ణమోహన్, ఏపీఓ కిషోర్ పాల్గొన్నారు.

ఆరోగ్య రక్షణకూ.. పరీక్షే

- ఏప్రిల్ 3 నుంచి పదో తరగతి పరీక్షలు
- చదువుపైనే అందరి దృష్టి
- నిద్ర, పౌష్టికాహారానికీ ప్రాధాన్యం ఇవ్వాలంటున్న నిపుణులు

పెదవేగి : పరీక్షలు.. ఏడాది శ్రమ ఫలితానికి ప్రామాణికం. అందుకే అవంటే విద్యార్థులు, తల్లిదండ్రులు, బోధకులు ప్రత్యేక దృష్టి సారిస్తారు. పరీక్షలు సమీపిస్తున్న కొద్దీ విద్యార్థులను భయం, ఆందోళన ఆవరిస్తుంటాయి. ఆతృతతో విద్యార్థులు అధిక సమయం చదవడం, సకాలంలో పౌష్టికాహారం తీసుకోపోవడం, నిద్రపోకుండా మానసిక ఒత్తిడికి గురవుతుంటారు. ఈ నేపథ్యంలో పరీక్షలంటే సాధారణమని, సామాజికమని చెబుతూ విద్యార్థుల్లో మనోధైర్యాన్ని నింపాలంటున్నారు వైద్యులు. ఏప్రిల్ 3 నుంచి 18వ తేదీ వరకు పదో తరగతి పరీక్షలు కొనసాగనున్న నేపథ్యంలో 16 రోజుల పాటు విద్యార్థులు పరీక్షల వాతావరణంలో మసలుకోవాల్సి ఉంటుంది. దెందులూరు నియోజకవర్గంలో 3,391 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు.



పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు


దుందుడుకు ప్రవర్తన వద్దు



ప్రతి వ్యక్తి స్వతంత్ర మానసిక స్థితి కలిగి ఉంటారు. ఒక్కొక్కరు చిన్నపాటి సమస్యకు సైతం మితిమీరి స్పందిస్తుంటారు. అలాంటివి పెద్ద సమస్యలకు దారితీస్తుంటాయి. విలువైన పరీక్షల సమయంలో అటువంటి వాటి జోలికి వెళ్లకుండా జాగ్రత్తపడాలి. సెల్‌ఫోన్ వాడకాన్ని తగ్గించడం ద్వారా కళ్లను ఆరోగ్యంగా ఉంచుకోవడంతో పాటు సమయాన్ని సద్వినియోగం చేసుకోవచ్చు.

– డాక్టర్ మాధవి, పెదవేగి పీహెచ్‌సీ


పౌష్టికాహారం తీసుకోవాలి



శరీరం, మనస్సు ఒక దానికొకటి అవినాభావ సంబంధం కలిగి ఉంటాయి. మనం తీసుకునే ఆహారం ఈ రెండింటినీ ప్రభావితం చేస్తుంది. పరీక్షల సమయంలో మానసికంగానూ, శారీరకంగానూ ఆరోగ్యంగా ఉండాలి. పోషక విలువలున్న ఆహారాన్ని విధిగా ఉండేలా చూసుకోవాలి. పరీక్షలు అయ్యే వరకూ సాత్వికాహారం తీసుకుంటే మంచిది.

– డాక్టర్ దుర్గాభవాని, కొప్పాక ఆయుర్వేద వైద్యశాల


అశ్రద్ధ చేయొద్దు



పరీక్ష కాలంలో ప్రతి క్షణం విలువైనదే. సమస్య తలెత్తితే విద్యార్థికి సమయాన్ని దూరం చేస్తుంది. చదువుతోపాటు తగిన విశ్రాంతి కూడా అవసరం. చిన్నపాటి తల నొప్పి, జ్వరం వచ్చినప్పటికీ ఏకాగ్రత దెబ్బతింటుంది. సమస్య పెద్దది కాకుండానే వైద్యుణ్ని సంప్రదించడం మంచిది. రోజుకు కనీసం ఆరు గంటల పాటు నిద్రపోవాలి. శరీరానికి, మెదడుకు తగిన విశ్రాంతి అవసరం.

– డాక్టర్ కె.భారతి, వట్లూరు ప్రాథమిక వైద్యశాల

నీరు బాగా తాగాలి



ఆహారంతోపాటు రోజుకు కనీసం మూడు లీటర్లు నీరు తాగాలి. ఉదయం రెండు నుంచి మూడు గ్లాసుల నీరు తాగడంతో ప్రారంభం కావాలి. ఆ తర్వాత సాయంత్రం ఆరు గంటల వరకూ గంటకొక గ్లాసు చొప్పున తాగాలి. భోజనం, ఇతర ఆహారం తీసుకోడానికి గంట ముందు నీరు తాగరాదు. తగినంత నీరు తాగకపోతే నీరసం వచ్చి ఏకాగ్రత దెబ్బతింటుంది.

– పి.పూర్ణిమ, పెదవేగి పీహెచ్‌సీ వైద్యాధికారి